క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



మద్నూర్(జుక్కల్) : ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన కర్తవ్యమని ప్రజా సమస్యలు నాకు వదిలేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని దన్నూర్‌లో శుక్రవారం సాయంత్రం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారుతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే రూ. 5 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్, దేవిదాస్‌పటేల్, మనోహర్ దేశాయ్ గ్రామస్తులున్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను శనివారం అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. దీంతోపాటు స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన కేసుల వివరాలను స్థానిక ఎస్సై రాజును అడిగి ఆయన తెలుసుకున్నారు. రాత్రివేళ గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆయన సూచించారు. దీంతోపాటు మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగుచర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు. ఆయనవెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఉన్నారు.

24న మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో ఈనెల 24వ తేదీన మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదబాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని సూచించారు.

డీవీ కృష్ణ స్మారకస్తూపం ఆవిష్కరణ



రామారెడ్డి : ఆచరణాత్మక ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త , భారత విప్లవోద్యమ నేత డీవీ కృష్ణ విప్లవకారులకే ఆదర్శమని సీపీఐ (ఎంఎల్) కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి రామ కృష్ణ అన్నారు. శనివారం రామారెడ్డిలోని అన్నారంలో కామ్రేడ్ కృష్ణ స్మారక స్తూప ఆవిష్కరణ, వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో స్మారక స్తూపావిష్కరణతో పాటు రెండవ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తుమన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆర్ రమేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ జిల్లా నాయకులు కిషోర్, దమోదర్‌రెడ్డి, రామారెడ్డి మండల కమిటీ సభ్యుడు కిషోర్,గోపాల్ పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రకృతివనం



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని మున్సిపల్ 24వ వార్డు ఇందిరానగర్ కాలనీ, గాంధీనగర్ మధ్య ఉన్న ప్రకృతివనం అధ్వానంగా తయారైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో (ఇప్పుడున్న మున్సిపల్ పాలకవర్గమే) నాలుగేళ్ల కిందట మొక్కలు నాటి కంచె వేసినా ఆలన పాలన పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం బహిర్భూమిగా మారింది. చెత్తకుప్పలు, పాతబట్టలు, చికెన్ వ్యర్థాలు వేస్తుండడంతో దుర్వాసనతో చుట్టుపక్కల వారికి ఇబ్బందిగా మారింది.

పింఛన్ల పంపిణీలో ఇబ్బందులను గుర్తించాలి



దోమకొండ : పింఛన్‌లు లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేయాలని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఉమాబాగ్‌లో పింఛన్‌ల పంపిణీ పరిశీలించారు. 9 మంది సిబ్బందితో పింఛన్‌లు అందిస్తున్నారన్నారు. తాగునీటి సదుపాయాన్ని గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లవు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎండీ షమీ, తదితరులున్నారు.

పాఠశాలల్లో జోరుగా పనులు



నిజాంసాగర్‌లోని పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు



సింగరాయపల్లిలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మరమ్మతు పనులు జోరందుకున్నాయి. అమ్మ ఆదర్శ కమిటీ పనుల తీరుపై అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడంతో కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు పనులను వేగవంతం చేశారు. ఈనెల 26 వరకు పనులు అభివృద్ధి పనులతో పాటు మరమ్మతులు పూర్తి చేయాలని తేల్చడంతో పనుల పురోగతిపై అధికారు లు దృష్టి సారించారు. హెచ్‌ఎం రాంచందర్, ఉపాధ్యాయులు వెంకటేశం, రాములు తదితరులు ఉన్నారు.

రామారెడ్డి : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి శనివారం పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామంలో పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ వెంట రామారెడ్డి ఎంపీడీవో సవిత ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఏర్రకుంట తాండ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శనివారం ఎంపీపీ వినీత, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను హెచ్‌ఎం మనోజ్‌కుమార్‌ను అడిగి వారు తెలుసుకున్నారు. వారివెంట నాయకులు దుర్గారెడ్డి ఉన్నారు. బెజుగం చెరువుతండా మాజీసర్పంచ్ మంగ్లీ ఇటీవల బస్సులో నుండి కిందపడి తీవ్రంగా గాయపడగా ఆమెను పరామర్శించారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నాణ్యతతో చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్, కిచ్చన్నపేట, అక్కంపల్లి పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులను శనివారం యన పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ అరుణప్రభ, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ ఉన్నారు.

విజయ డెయిరీ ఎదుట పాడి రైతుల ధర్నా



కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న ఎర్రపహాడ్ రైతులు

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేట గ్రామ శివారులో విజయపాల డెయిరీ వద్ద తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌కు చెందిన బీఎంసీ పాడి రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రపహాడ్ బీఎంసీయూ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ మూడు నాలుగు రోజుల్లో వచ్చే పాల బిల్లులు సుమారు రెండు నెలలు గడుస్తున్నా రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వెంటనే ఆ పాల బిల్లులు వచ్చే విధంగా చూడాలని కోరారు. పాల బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సుమారు 3 కోట్ల 50 లక్షల వరకు బిల్లులు రైతులకు రావాల్సి ఉందని తెలిపారు. వెంటనే బిల్లులు చెల్లించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే పశువుల దాణా, గడ్డి విత్తనాలు, క్యాల్షియం మినరల్ మిక్చర్ లాంటివి సకాలంలో సరఫరా చేయాలని కోరారు. ఈ ధర్నాలో డైరెక్టర్లు గాదెల కాశయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, బద్దం సంజీవ రెడ్డి, సాయిరెడ్డి, భాగవ్వ తదితరులున్నారు.

‘ప్రజావాణి’కి హాజరుకావాలి



పిట్లం(జుక్కల్) : జిల్లా కలెక్టర్ సెంగ్వాన్ ఆదేశాల మేరకు పిట్లం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. తహసీల్దార్ కార్యలయంలో ధరణి రిజిస్ట్రేషన్లు సజావుగా కొనసాగుతున్నాయన్నారు.

జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలి



యోగాసనాలు వేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి : ప్రతిఒక్కరూ వారి జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సూచించారు. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శనివారం యోగామాస్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు యోగాసానాలు వేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

కామారెడ్డి క్రైం : సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్ లను గురిచి ఇద్దరు వ్యక్తులకు పట్టణ పోలీసులు శనివారం అందజేశారు. మహ్మద్ యూసుఫ్ అనే వ్యక్తి నెల రోజుల క్రితం, ఇటీవల పత్మ అనే మహిళ సెల్ ఫోన్ లను పోగొట్టుకోగా వాటిని నూతన టెక్నాలజా ద్వారా గుర్తించి అప్పగించామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పోచారంను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



బాన్సువాడ : హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శనివారం బాన్సువాడ నియోజకవర్గంకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నిలిచిన అభివృద్ది పనుల కోసమే ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు.

అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే పార్టీ మారారు..



బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని ఎమ్మెల్యే అనుచరులు అంజిరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే పోచారం నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పాడ కూడదనే ఉద్దేశ్యంతో పోచారం పార్టీ మారినట్లు ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అనుచరులు దాసరి శ్రీనివాస్, కృష్ణరెడ్డి, ఎజాస్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నీటివనరుల ఉపయోగంపై అవగాహన



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలంలోని సోమ్లా నాయక్ తండా గ్రామంలో పద్మపాని ఎన్జీవో ఆధ్వర్యంలో బాగస్వామ్య పద్ధతిలో సహజ నీటి వనరు ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని రిసోర్స్ మ్యాప్ ద్వారా గుర్తించి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మపాని ఎన్జీవో డైరెక్టర్ సత్యనారాయణ, విక్రమ్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ రాయల భూపతి, గ్రామ వీడీఎఫ్ మెంబర్స్ చందర్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం పండుటాకుల తిప్పలు



భిక్కనూరు : నెల ముగిసేందుకు వచ్చినా పింఛన్ డబ్బులు రాక ఇబ్బందులు పడ్డ వృద్ధులకు శుక్రవారం నుంచి పింఛన్లు ఇస్తున్నారని తెలియడంతో సంబురపడ్డారు. మండలంలోని అంతంపల్లి జీపీ కార్యాలయం వద్ద పింఛన్ లబ్ధిదారులు శనివారం ఉదయం నుంచే పింఛన్ డబ్బుల కోసం కూర్చున్నారు. పింఛన్ డబ్బులు ఇచ్చే పోస్టల్ సిబ్బంది 10 గంటలకు రావాల్సి ఉన్నా ఆయన 12 గంటల వరకు రాలేదు. అప్పటిదాకా వృద్దులు అక్కడే ఎండలో వేచిచూస్తూ కూర్చున్నారు.

స.హ.చట్టం వజ్రాయుధం లాంటిది



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : స.హ.చట్టం వజ్రాయుదం లాంటిదని స.హ.చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ.సలీం సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సహ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఈక శ్రీనివాస్, సతీష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సాదిక్ అలీ తదితరులున్నారు.

కలకలం రేపిన ఉత్తరాలు..

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు రాసిన ఉత్తరాలు శనివారం కలకలం రేపాయి. వీడీసీ పేరిట బెల్ట్‌షాపులకు టెండర్లు వేయాలని చూస్తున్నారని గతంలో బెల్ట్‌షాపుకు టెండర్ వేయడం వల్ల వచ్చిన రూ. 20 లక్షలకు సంబంధించి వీడీసీ లెక్కలు చూపలేదంటూ గుర్తుతెలియని వ్యక్తి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సరుగు నరేష్ మూర్తితో పాటు పలువురికి శనివారం పోస్టు ద్వాకా ఉత్తరాలు పంపాడు. ఈ ఉత్తరాలు గ్రామంలో కలకలం రేపాయి. ఈ ఉత్తరాల్లో పలు ఆరోపణలు కూడా ఉన్నాయి. వీడీసీ డబ్బులను విచ్చల విడిగా ఖర్చు చేశారని అభివృద్ధి పనులకు ఖర్చుచేయకుండా సొంత లాభం చేకూర్చే పనులు చేశారని ఉత్తరంలో ఆరోపించారు. గ్రామంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఎమ్మెల్యే కూడా పిర్యాదు చేయనున్నట్లు ఆ ఉత్తరంలో గుర్తుతెలియని వ్యక్తి తెలిపాడు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య



భిక్కనూరు : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నారని భిక్కనూరు ఎంపీడీవో ప్రవీన్‌కుమార్, ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. శనివారం వారు భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు లింబాద్రి, గఫూర్ శిక్షక్, తబిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు



నాగిరెడ్డిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం



లింగంపేటలో..

రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్ మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని వారన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో..



తాడ్వాయిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఆర్గొండలో..



సదాశివనగర్‌లో..

ఇసుక అనుమతులు నిలిపేయాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల క్వారీల నుంచి అక్రమ ఇసుక అనుమతులు తీసుకొని కొందరు వనరులు దోచుకుంటున్నారని మండల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ పాటిల్, న్యాయవాదులు తెలిపారు. వెంటనే అనుమతులు రద్దు చేసి ఇసుక అక్రమ రవాణాను నిలిపి వేయాలని కోరుతూ శనివారం బిచ్కుంద బార్ అసోసియేషన్ నాయకులు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. ఖద్గాం, శెట్లూర్, గుండెనెమ్లి, హజ్గుల్ మంజీరా నదిలో గత కొన్ని రోజుల నుంచి నిబంధనలకు విరుద్దంగా రాత్రీ పగలు తేడాలేకుండా తవ్వకాలు జరిపి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపండుతుందని వెంటనే నిలిపి వేయాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారికి ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, లక్ష్మణ్‌రావు, మల్లేశం, విఠల్‌రావు, ప్రకాష్, మహ్మద్, శ్రీనివాస్, పురుషోత్తం శివాజీ, శంకర్‌రావు పాటిల్, అనంతరావు పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలివ్వాలి



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

కామారెడ్డి టౌన్ : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణపరిమితి పెంచి రైతులకు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం శోభన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కామారెడ్డి డీసీసీబీ బ్యాంకు ముందు రైతులతో ధర్నా చేపట్టిన అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వానాకాలం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని ప్రభుత్వం స్పందించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని ప్రతి రైతుకు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధారవత్ మోతీరామ్, ఉపాధ్యక్షురాలు సావిత్రి, నాయకులు కుమ్మరి సాయిలు, గైని చిన్న సాయిలు, రోజా, రామోల్ల రాములు, మంజుల, సాయవ్వ, స్వప్న, పెద్ద సాయవ్వ, ప్రకాష్, వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

లక్ష్మీమాత ఆలయంలో పూజలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లి గ్రామంలో శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా లక్ష్మీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కౌలాస్ పీఠాధిపతులు సత్య నారాయణ వ్రతం కథను ప్రజలకు వివరించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వివిధగ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన నల్లపోచమ్మ ఆలయం

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌లో ఆదివారం ప్రజలు నల్ల పోచమ్మ పండగను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం గ్రామస్తులు నల్ల పోచమ్మ తల్లికి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. మహిళలు బోనాలతో మద్నూర్‌లో ప్రధాన విధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి గ్రామ దేవతైన నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అలాగే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

హంపీ పీఠాధిపతి జన్మదిన వేడుక



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయం కమిటీ ఆధ్వర్యంలో శనివారం జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా జగద్గురువు హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్, గురుస్వామి ఈశ్వర్ దయాల్ రెడ్డి, సభ్యులు భగవాన్, సతీష్, శీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కానిస్టేబుల్ రక్తదానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లుపేటకు చెందిన బాలవ్వకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జానకీరాం స్పందించి రక్తం దానం చేశారు.

‘అన్నం పెట్టిన పార్టీని వీడడం సిగ్గుచేటు’

రాజంపేట : పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారం కోసం కన్నతల్లి లాంటి బీఆర్‌ఎస్ పార్టీని వీడడం సిగ్గు చేటని రాజంపేట సొసైటి వైస్ చైర్మన్ శనివారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.సుదీర్ఘ కాలంగా రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తులు ఇలా అధికారం కోసం పార్టీలు మారడం ఏ నైతిక విలువలకు సంకేతమని ఆయనఅభిప్రాయం వ్యక్తం చేశారు.

నేడు జగదాంబ సరస్వతి స్మృతి దివస్

కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మాతేశ్వరి జగదాంబ సరస్వతి 59వ పుణ్యస్మృతి దివాస్ ఈనెల 23న ఆదివారం స్థానిక పంచముఖి హన్‌మాన్ కాలనీలోని ఓంశాంతి కేంద్రంలో ఉదయం 7గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ముఖ్యఅతిథిగా హాజరు అవుతారన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

రాజంపేట : ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటున్న రాజంపేట గ్రామానికి చెందిన రవి కూతురు స్థానిక శారదా శిశుమందిర్ పాఠశాలలో చదువుతుంది. రామ సేవా సమితి (కామారెడ్డి) సభ్యులు శనివారం పాఠశాల హెచ్‌ఎం పండరీనాథ్‌కు విద్యార్థిని ఫీజును అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మొలుగు చంద్రమౌళి, ఉపాధ్యాయులు ప్రభాకర్, సోనిప్రియ, సుష్మిత తదితరులున్నారు.

బంజారా సమ్మేళనాన్ని సక్సెస్ చేయాలి

కామారెడ్డి టౌన్ : లంబాడి హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 1వ తేదిన హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గణేష్ నాయక్, రణాపత్రాప్‌లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం షౌకత్‌అలీ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



కామారెడ్డి క్రైం : పట్టణంలోని మైనారిటీ బాలికల వసతి గృహాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ ఇన్‌చార్జి అధికారి దయానంద్ శనివారం సందర్శించారు. స్టోర్ రూంను, సామగ్రిని పరిశీలించారు. విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.